క్లుప్తంగా

నగరంలో విస్తృతంగా తనిఖీలు



లబ్బీపేట(విజయవాడతూర్పు):నగరంలో టాస్క్‌ఫోర్స్, ఈగల్ బృందాలు సోమవారం విస్తృతంగా తనిఖీలు నిర్వహించాయి. డీసీపీ కేజీవీ సరిత పర్యవేక్షణలో శక్తి, ఈగల్, మహిళా పోలీస్‌స్టేషన్ బృందాలు విస్తృతంగా తనిఖీలు చేపట్టాయి. నగరంలోని పలు పాఠశాలలు, కళాశాలలు, ప్రాంతాలను సందర్శించి విద్యార్థులు, మహిళలు, యువతకు శక్తి యాప్‌పై అవగాహన కల్పించారు. యాంటీ నార్కోటిక్ , ఈగల్ బృందాలు పలు ప్రదేశాల్లో తనిఖీలు నిర్వహించి 117 మందికి కౌన్సెలింగ్ ఇచ్చారు. వారిలో 49 మంది అనుమానిత వ్యక్తులను మొబైల్ సెక్యూరిటీ చెక్ డివైజ్ ద్వారా తనిఖీ చేశారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించిన 20 మందిని అదుపులోకి తీసుకుని తగు చర్యల నిమిత్తం సమీప పోలీసుస్టేషన్లలో అప్పగించారు. ఐదు పాన్‌షాపులు, బడ్డీకొట్లు తనిఖీ చేశారు. లేడీస్ హాస్టళ్ల సమీపంలో పటిష్టమైన నిఘా ఏర్పాటు చేసినట్లు పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబు తెలిపారు.

ఆరుగురికి జైలుశిక్ష

లబ్బీపేట(విజయవాడతూర్పు): మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పోలీసుల తనిఖీల్లో పట్టుబడిన తొమ్మిది మందికి న్యాయస్థానం జరిమానా, జైలుశిక్ష విధించింది. వివరాల్లోకి వెళితే..నగరంలోని 6వ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో నిర్వహించిన తనిఖీలో తొమ్మిది మంది మద్యం సేవించి వాహనాలు నడుపుతున్నట్లు గుర్తించారు. వారిపై కేసులు నమోదు చేసి 7వ అడిషనల్ జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ ఆర్‌వీఎస్ శర్మ ఎదుట హాజరుపర్చారు. వీరిలో ముగ్గురికి ఒక్కొక్కరికి రూ.10 వేలు చొప్పున జరిమానా, ఆరుగురికి ఏడు రోజులపాటు జైలుశిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు.

15న మృదంగ సద్గురువుల సంస్మరణ మహోత్సవం

విజయవాడ కల్చరల్: మహదేవపు రాధాకృష్ణంరాజు మెమోరియల్ చారిటబుల్ సంస్థ ఆధ్వర్యంలో 15 వ తేదీ మృదంగ సద్గురువుల సంస్మరణ మహోత్సవాలు నిర్వహిస్తునట్లు నిర్వాహకుడు పారుపల్లి సుబ్బరాయ ఫల్గుణ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. శివరామ కృష్ణ క్షేత్రంలో నిర్వహించే కార్యక్రమంలో సంగీత రంగానికి చెందిన జొన్నలగడ్డ సత్యశ్రీరాం, కాల్వ ఎంవీ సుబ్బరామయ్య, కేఎం మనోహర్‌కు మహదేవపు లక్ష్మీనారాయణ పురస్కారం ప్రదానం చేస్తునట్లు చెప్పారు. సంగీత కళాశాల ప్రిన్సిపాల్ సి.జోతిర్మయి, వయోలిన్ విద్వాంసులు అన్నవరపు రామస్వామి పాల్గొంటారని పేర్కొన్నారు.

నత్తనడకన రహదారి పనులు



మధురానగర్(విజయవాడసెంట్రల్):దావు బుచ్చయ్యకాలనీ గుణదల రోడ్డు పనులు నత్తనడకన సాగుతున్నాయి. దీంతో రాకపోకలు సాగించేందుకు వాహనచోదకులు, పాదచారులు అవస్థలు పడుతున్నారు. ఇక్కడ పనులు ప్రారంభించి నెల రోజులు దాటినా ఇంత వరకు పూర్తికాలేదు. కేవలం గ్రావెల్, కంకర పోసి వదిలివేశారు. కనీసం రోలింగ్ కూడా చేయలేదు. దీంతో రాకపోకలు సాగించే క్రమంలో విలువైన తమ వాహనాలు పాడవుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. దావు బుచ్చయ్యకాలనీ నుంచి గుణదల వెళ్లేందుకు దగ్గరి మార్గం కావటంతో వాహన చోదకులు ఇబ్బందికరంగా ఉన్నప్పటికీ రాకపోకలు సాగిస్తున్నారు. సాధ్యమైనంత త్వరలో రోడ్డు పనులు పూర్తిచేసి వినియోగంలోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

చెస్‌లో లిఖిత్ ప్రతిభ



అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్):ఈ నెల 3వ తేదీన రాజమండ్రిలో జరిగిన ఇండియా ఓపెన్ చెస్ టోర్నమెంట్‌లో రుషి ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ విద్యార్థి ఎ.లిఖిత్ ప్రతిభ కనబర్చాడు. అండర్-11 కేటగిరిలో 3వ స్థానం సాధించి ట్రోఫీతో పాటు నగదు బహుమతిని అందుకున్నాడు. స్కూల్ ప్రిన్సిపల్ టి.శ్రీనివాసరావు, సింగ్‌నగర్ రామకృష్ణ చెస్ కోచ్ ఎ.రామకృష్ణ ఇతర ఉపాధ్యాయులు విజేత లిఖిత్‌ను సోమవారం సన్మానించి అభినందనలు తెలిపారు. లిఖిత్ ఇలానే మరిన్ని పతకాలు సాధించి నగరానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

డంపింగ్ యార్డులా ఇన్నర్ రింగ్ రోడ్డు

- రోడ్డు మార్జిన్లలో భవన నిర్మాణ వ్యర్థాలు..
- హోటళ్లు, బిర్యానీ పాయింట్ల వ్యర్థాలన్నీ ఇక్కడే
- పెరిగిన పందుల సంచారం
- ఇబ్బందుల్లో వాహనచోదకులు, స్థానికులు





ఇన్నర్ రింగ్ పక్కన డంప్ చేసిన భవనాలు, సెప్టిక్ ట్యాంకు వ్యర్థాలు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): నగరవాసులకు ప్రయాణం మరింత సులభతరం చేసేందుకు నిర్మించిన ఇన్నర్ రింగ్ రోడ్డు కాస్తా కొంతమంది స్వార్థపూరిత వ్యక్తుల కారణంగా డంపింగ్ యార్డులా మారింది. సింగ్‌నగర్ పరిసర ప్రాంతవాసులు భవానీపురం వెళ్లాలన్నా, వైఎస్సార్‌కాలనీ, వన్‌టౌన్ వాసులు సింగ్‌నగర్ పరిసరాలకు వెళ్లాలన్నా ఈ ఇన్నర్ రోడ్డు మీదుగా ప్రయాణం సాగించాల్సిందే..

నిత్యం వేలాది మంది రాకపోకలు సాగించే ఈ ఇన్నర్ రోడ్డు కొంతకాలంగా సరైన నిర్వహణ లేక డంపింగ్ యార్డును తలపిస్తోంది. కొంతమంది వ్యక్తులు భవన నిర్మాణాల్లో వచ్చే వ్యర్థాలతో పాటు సెప్టిక్ ట్యాంక్, కోళ్ల నుంచి వచ్చే వ్యర్థాలను సైతం ఇన్నర్ రింగ్‌రోడ్డులో పడేస్తున్నారు. దీంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. మరోవైపు ఖాళీ స్థలాల్లో వేయాల్సిన రాళ్లు, మట్టిని పొలాల పక్కనే పడేస్తుండటంతో పంటలు దెబ్బతింటున్నాయని రైతులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. అంబాపురం పంచాయితీ పరిధిలో కొన్నిచోట్ల చెత్త, వ్యర్థాలు వేయవద్దని జిల్లా కలెక్టర్ హెచ్చరిక బోర్డులను సైతం ఏర్పాటు చేసినప్పటికీ సెప్టిక్‌ట్యాంకు నిర్వాహకులు, చికెన్‌షాపు యజమానులు ఏమాత్రం ఖాతరుచేయకుండా వ్యర్థాలను అక్కడే పడేస్తుండటం గమనార్హం.

రాత్రి వేళల్లోనే డంపింగ్..

సింగ్‌నగర్, పాయకాపురం, కండ్రికతో పాటు ఇటు పశ్చిమ నియోజక వర్గంలోని భవానీపురం, చిట్టినగర్, గొల్లపూడి, కబేళా ప్రాంతాల్లో నిర్మాణంలో ఉన్న భవనాల నుంచి వచ్చే మట్టి, రాళ్లను రాత్రి వేళలలో గుట్టు చప్పుడు కాకుండా ఇక్కడ పడేస్తున్నారు. మట్టి, వ్యర్థాలు గాలికి ఎగిసిపడి వాహనచోదకుల కళ్లలో పడుతుండటంతో వాహనచోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. మరో ఇన్నర్ రింగ్ కేంద్రంగా పెరుగుతున్న హోటల్స్, బిర్యానీ పాయింట్లలో వచ్చే వ్యర్థాలను రోడ్డు పక్కనే పడేయడంతో వాటి కోసం వచ్చే కుక్కలు, పందులు సంఖ్య పెరుగుతోంది. వ్యర్థాలు తిన్న తర్వాత కుక్కలు రోడ్డుకు అడ్డంగా పరుగులు పెడుతుండటంతో ద్విచక్ర వాహనదారులు ప్రమాదాల బారినపడుతున్నారు.

కోళ్లు, సెప్టిక్ ట్యాంక్ వ్యర్థాలు

రాత్రి సమయంలో అయితే ఎవ్వరూ అభ్యంతరం పెట్టరనే ఉద్దేశంతో సెప్టిక్ ట్యాంక్ లు వ్యర్థాలు, కోళ్ల వ్యర్థాలను ఇక్కడ పడేస్తున్నారని స్థానికులు చెబుతున్నారు. ఈ వ్యర్థాల వచ్చే దుర్వాసన వస్తుండటంతో ఇళ్లు, ప్లాట్లలో ఉండలేకపోతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇన్నర్ రింగ్‌రోడ్డులో వ్యర్థాలు డంపింగ్ చేయకుండా ఇటు అంబాపురం పంచాయితీతోపాటు నగరపాలక సంస్థ చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ఘాట్‌రోడ్డు వద్ద ప్రసాదాల కౌంటర్

సాక్షి ఎఫెక్ట్



ఘాట్‌రోడ్డులో ఏర్పాటు చేసిన ప్రసాదాల కౌంటర్

ఇంద్రకీలాద్రి(విజయవాడ పశ్చిమ): దుర్గగుడి ఘాట్‌రోడ్డు ప్రారంభంలోని కామధేను అమ్మవారి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన కౌంటర్‌ను సోమవారం ఆలయ ఈవో శీనా నాయక్ ప్రారంభించారు. గత నెల 15వ తేదీన 'నిరుపయోగంగా నిర్మాణాలు' శీర్షికన 'సాక్షి' దినపత్రిక ప్రచురించిన కథనానికి దుర్గగుడి అధికారులు స్పందించారు. ఘాట్‌రోడ్డు , ఓం టర్నింగ్‌ల వద్ద దేవస్థానం నిర్మించిన కౌంటర్లు ప్రారంభానికి నోచుకోక భక్తులు పడుతున్న ఇబ్బందులను కథనంలో వివరించారు. దీంతో స్పందించి దుర్గగుడి అధికారులు సోమవారం పూజా కార్యక్రమాలను నిర్వహించి ప్రసాదాల కౌంటర్‌ను ప్రారంభించారు. ఈ కౌంటర్‌లో భక్తులకు అమ్మవారి లడ్డూ, పులిహోర ప్రసాదాలతోపాటు కార్ల పూజా టికెట్లు, కొబ్బరి కాయలను దేవస్థానం అందుబాటులో ఉంచింది. ఘాట్‌రోడ్డు వద్ద ప్రసాదాల కౌంటర్ ప్రారంభం కావడంతో ఇతర ప్రాంతాలకు ప్రయాణించే భక్తులకు అమ్మవారి ప్రసాదాలు అందుబాటులోకి వచ్చాయని భక్తులు పేర్కొన్నారు. అందుకు కృషి చేసిన 'సాక్షి' దినపత్రికకు భక్తులు కృతజ్ఞతలు తెలియజేశారు.

కార్పొరేషన్ గ్రీవెన్స్‌కు 17 అర్జీలు



అర్జీలు స్వీకరిస్తున్న వీఎంసీ అదనపు కమిషనర్(ప్రాజెక్ట్స్) డి.చంద్రశేఖర్

పటమట(విజయవాడతూర్పు): వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూంలో విజయవాడ నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వీఎంసీ అదనపు కమిషనర్(ప్రాజెక్ట్స్) డాక్టర్ డి.చంద్రశేఖర్ హాజరై నగరవాసుల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణ ప్రణాళికపై 7 అర్జీలు, ఇంజినీరింగ్ విభాగానికి సంబంధించి మూడు, రెవిన్యూకి ఒకటి, ఎస్టేట్ నాలుగు, హౌసింగ్‌కు సంబంధించి రెండు కలిపి మొత్తం 17 అర్జీలు అందినట్లు వివరించారు. కార్యక్రమంలో చీఫ్ సిటీ ప్లానెర్ సంజయ్ రత్నకుమార్, చీఫ్ ఇంజనీర్ ఆర్.శ్రీనాథ్ రెడ్డి, చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ కె.అర్జునరావు, డిప్యూటీ కమిషనర్ (రెవెన్యూ) జి.సృజన, అమృత్ విభాగం జాయింట్ డైరెక్టర్ డాక్టర్ లత, పర్యవేక్షణ ఇంజనీర్ పి.సత్యకుమారి, పి.సత్యనారాయణ, డిప్యూటీ డైరెక్టర్ (హార్టికల్చర్) చంద్రశేఖర్, ఎస్టేట్ ఆఫీసర్ ఏ.శ్రీధర్, బయాలజిస్ట్ కామేశ్వరరావు, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ బి.ఎస్.ఎస్.సోమశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

అత్తింటి వేధింపులపై ఫిర్యాదు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): వేధింపులకు గురిచేస్తున్న అత్తింటివారిపై ఓ వివాహిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కొత్తపేట పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు.. వించిపేట రామాలయం ప్రాంతానికి చెందిన యర్రంశెట్టి నాగవిద్యాభవానీకి 2010లో వాసు శివశంకరరావుతో వివాహమైంది. వివాహ సమయంలో రూ. 5 లక్షల కట్నం, మూడు లక్షల విలువైన బంగారపు నగలను లాంఛనంగా ఇచ్చారు. వీరికి తొలుత ఇద్దరు ఆడపిల్లలు సంతానం కాగా మూడో సంతానంగా మగపిల్లాడు పుడతాడని ఆశించారు. అయితే మూడో సంతానం కూడా ఆడపిల్ల పుట్టడంతో విద్యాభవానీకి అత్తింటి నుంచి వేధింపులు ప్రారంభమయ్యాయి. దీంతో 2016లో బాధితురాలు కేసు పెట్టగా, లోక్ అదాలత్‌లో రాజీ చేసుకున్నారు. అత్తతోపాటు ఆడపడుచులైన లక్ష్మి, ఆమె భర్త శ్రీనులు వివాహేతర సంబంధం అంటకట్టి డీఎన్ఏ టెస్ట్ చేయించాలని సలహాలు ఇచ్చేవారు. దీంతో వేధింపులను భరించలేక బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సాంకేతిక పరిజ్ఞానంపై పట్టు సాధించాలి

రామవరప్పాడు: ఉన్నత విద్య, అంతర్గత నైపుణ్యాలు మెరుగుపరుచుకున్న విద్యార్థులకు ఉద్యోగాలిచ్చేందుకు ఎంఎన్‌సీ కంపెనీలు అన్వేషిస్తున్నాయని టెక్ మహీంద్ర ఉద్యోగ నియామక ముఖ్యఅధికారి వి.శ్రీనివాసరెడ్డి అన్నారు. విజయవాడ రూరల్ మండలం ఎనికేపాడులోని ఎస్సార్కే ఇంజినీరింగ్ కళాశాలలో సోమవారం 'ఉన్నత ఉద్యోగాల సాధన' అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ఉన్నత విద్య ఎంత అవసరమో నైపుణ్యాలు కూడా అంతే అవసరమన్నారు.

భగవద్గీతను నిత్యం పారాయణం చేయాలి



విజయవాడ కల్చరల్: భగవద్గీతను నిత్యం పారాయణం చేయాలని ఆధ్యాత్మికవేత్త భార్గవ శ్రీరామచంద్రమూర్తి సూచించారు. శృంగేరీ జగద్గురువులు భారతీ తీర్థ మహాస్వామి ఆశీస్సులతో శివరామ కృష్ణ క్షేత్రంలో నిర్వహిస్తున్న ఆదిశంకర విరచిత శంకరభాష్య భగవద్గీత ప్రవచనాలు ఆధ్మాతిక సంప్రదాయాన్ని చాటుతున్నాయి. సోమవారం నాటి కార్యక్రమంలో శ్రీ రామచంద్రమూర్తి భగవద్గీతలోని అర్జున విషాదయోగం, సాంఖ్యయోగంలోని విశేషాలను వివరించారు. భగవద్గీత వ్యక్తిత్వ వికాస గ్రంథమని భగవాన్ శ్రీ కృష్ణుడు మానవాళి కోసం అందించారని చెప్పారు. సమస్తవేద సారం భగవద్గీతలో కనిపిస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమాన్ని శివరామకృష్ణ క్షేత్రం ధర్మాధికారి హనుమత్ ప్రసాద్ ప్రారంభించారు. భారతీ తీర్థ మహాస్వామి 75 జన్మదిన వేడుకల సందర్భంగా కార్యక్రమాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆదిశంకరులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

వైభవంగా విగ్రహాల ప్రతిష్ఠ



తిరువూరు: ఏ.కొండూరు మండలం రామచంద్రాపురంలో నూతనంగా నిర్మించిన శివ దత్తసాయి మందిరంలో విగ్రహాల ప్రతిష్ఠా కార్యక్రమాన్ని సోమవారం వైభవంగా నిర్వహించారు. సాయిబాబా, నంది, వినాయకుడు, దత్తాత్రేయ విగ్రహాలతో పాటు శివలింగాన్ని ఆలయ నిర్మాణ కర్తలు, ప్రవాస భారతీయులు గుంటక సుదర్శనరెడ్డి కుటుంబ సభ్యులు ప్రతిష్ఠించారు. మండలంలోని పలు గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో కార్యక్రమంలో పాల్గొన్నారు.

జీవనోపాధుల మిషన్‌పై సమీక్ష



సమావేశంలో పాల్గొన్న సునీల్‌కుమార్ యాదవ్, తేజ్ భరత్, చంద్రశేఖర్, వెంకటనారాయణ

భవానీపురం(విజయవాడపశ్చిమ): దీన్‌దయాళ్ అంత్యోదయ జాతీయ పట్టణ జీవనోపాధుల మిషన్‌పై సోమవారం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూంలో సోమవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. నేషనల్ అర్బన్ లైవ్లీ హుడ్ మిషన్‌లో భాగంగా పైలెట్ ప్రాజెక్ట్‌గా విజయవాడలో చేపట్టిన ఈ కార్యక్రమ ప్రగతిని మెప్మా మిషన్ డైరెక్టర్ ఎన్.తేజ్‌భరత్ సవివరంగా వివరించారు. దేశం మొత్తంలో ఏపీ రాష్ట్రం ఎప్పుడూ మొదటిస్థానంలో ఉంటుందని తెలిపారు. అనేక సామాజిక, ఆర్థిక మోడళ్లను రాష్ట్రం నెలకొల్పిందని చెప్పారు. వల్నరబుల్ కమ్యూనిటీ, గిగ్ వర్కర్ల సంఘాలను ఏర్పాటు చేయడంలో విజయవాడ ముందంజలో ఉందన్నారు. యూసీడీ పీడీ పీ వెంకటనారాయణ మాట్లాడుతూ షనల్ అర్బన్ లైవ్ అడ్మిషన్‌లో భాగంగా నగరపాలక సంస్థలో పైలెట్ ప్రాజెక్ట్‌లో లేబర్ చౌక్‌లు, షెల్టర్ ఫర్ అర్బన్ హోమ్ లెస్, సిటీ లైవ్లీహుడ్ సెంటర్, కేర్ ఇన్ఫ్రాస్ట్రక్చర్, స్ట్రీట్ వెండింగ్ జోన్, స్ట్రీట్ షెల్టర్లు, సుయోగ్ సెంటర్ అంశాల గురించి వివరించారు. 323 కామన్ ఇంట్రస్ట్ గ్రూపులను ఏర్పాటు చేశారన్నారు. డొమెస్టిక్, కన్‌స్ట్రక్షన్, గిగ్ వర్కర్లతో స్వయం సహాయక బృందాలను ఏర్పాటు చేసినట్లు వివరించారు. దీన్ దయాళ్ అంత్యోదయ జాతీయ పట్టణ జీవనోపాధుల మిషన్ డైరెక్టర్ డాక్టర్ సునీల్ కుమార్‌యాదవ్ మాట్లాడుతూ మెప్మాలో డిజిటల్ ఇనిషియేటివ్‌లు బాగున్నాయన్నారు. ఇదే విధానంలో పట్టణ పేదరికాన్ని నిర్మూలించాలని సూచించారు. నగరపాలక సంస్థ అడిషనల్ కమిషనర్ (ప్రాజెక్ట్స్) డాక్టర్ డి.చంద్రశేఖర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సమావేశంలో స్టేట్ మిషన్ మేనేజర్లు రంగాచార్యులు, ఎస్ఎస్ఆర్ శ్రీనివాస్, మెప్మా, వీఎంసీ యూసీడీ సీడీఓలు తదితరులు పాల్గొన్నారు.

ఎస్టీ కుటుంబంపై దాడికి టీడీపీ నాయకుల యత్నం

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): ఎస్టీ మహిళ కుటుంబంపై టీడీపీ నాయకులు దాడికి యత్నించారు. కర్రలు, ఇనుపరాడ్‌లతో హల్‌చల్ చేశారు. దీనికి సంబంధించిన వీడియోల సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. వివరాల్లోకి వెళితే..విజయవాడలోని టైలర్‌పేట 166 సచివాలయం వద్ద కట్టా వెంకటకృష్ణ ఈనెల ఒకటో తేదీన తనతండ్రి వర్ధంతిని నిర్వహించారు. ఫంక్షన్ పూర్తయిన తర్వాత సామాన్లు శుభ్రం చేసుకునే క్రమంలో వెంకటకృష్ణ గిన్నె కడిగిన నీళ్లను రోడ్డుపై పోయగా, ఆ సమయంలో అటుగా వెళ్తున్న టీడీపీ నాయకుడు కొప్పుల గంగాధర్ భార్య అరుణశ్రీపై పడ్డాయి. దీంతో వారి మధ్య గొడవ చోటుచేసుకుంది. దీంతో ఇరువర్గాలు పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదులు చేసుకున్నారు. ఈక్రమంలో గంగాధర్ మరి కొంతమంది ఇనుప రాడ్లు తీసుకుని ఫంక్షన్ జరిగిన ప్రాంతానికి వెళ్లి నోటికొచ్చినట్లు దూషించడమే కాకుండా షామియానాలోని సామగ్రిని ధ్వంసం చేశారు. ఈ విషయంపై వెంకట కృష్ణ భార్య పోలీసులకు ఫిర్యాదు చేసింది. అయితే పోలీసులు అధికార పార్టీ నాయకుల నుంచి వచ్చిన ఒత్తిడితో కేవలం అరుణశ్రీ ఇచ్చిన ఫిర్యాదుపైనే కేసు నమోదు చేసి, వెంకటకృష్ణను అరెస్టు చేశారు.వెంకటకృష్ణ భార్య ఇచ్చిన ఫిర్యాదుపై మాత్రం కేసు నమోదు చేయలేదు. ఈనేపథ్యంలో టీడీపీ నాయకుల ఆగడాలపై సోమవారం లంబాడీపేటకు చెందిన గిరిజన సంక్షేమ సంఘం నేతలు కొత్తపేట సీఐ చిన్న కొండలరావును కలిసి వినతిపత్రం అందజేశారు. కట్టా వెంకటకృష్ణ భార్య జ్యోతి కూడా గంగాధర్ తదితరులపై ఫిర్యాదు చేసింది. టీడీపీ నాయకులు కర్రలు, ఇనుప రాడ్‌లతో దాడిచేసేందుకు వచ్చిన వీడియోలను సైతం బాధిత కుటుంబసభ్యులు పోలీసులకు అందజేసి కేసు నమోదు చేయాలని కోరారు. ఈసందర్భంగా గిరిజన సంఘ నాయకులు మాట్లాడుతూ పోలీసులు అధికార పార్టీ వైపు నిలిచి బాధితులపై కేసు నమోదు చేయడం సరికాదన్నారు. ఈ విషయంపై తగిన న్యాయం జరగకపోతే కమిషనర్‌ను ఆశ్రయిస్తామని వారు తెలిపారు.

● 'తల్లికి వందనం' ఇప్పించరూ...



ఈ చిత్రంలో కనిపిస్తున్న ఈ ఇద్దరు చిన్నారుల పేర్లు మీంజేటి గీతాశ్రీ,, మింజేటి సాన్వి. విజయవాడ విద్యాధరపురంలో ప్రైవేటు పాఠశాలలో ఏడు, మూడో తరగతి చదువుతున్నారు. వీరి తండ్రి అనారోగ్యంతో బాధపడుతుండగా, తల్లి ఇతరుల ఇళ్లలో పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తోంది. బాలికల్లో గీతాశ్రీ పేరు 'తల్లికి వందనం' పథకం అర్హుల జాబితాలో ఉన్నప్పటికీ నగదు మాత్రం బ్యాంకులో జమకాలేదు. సాన్వి పేరు రేషన్‌కార్డులో లేనందున చైల్డ్ ఇన్ఫో ఐడీలో నమోదు కూడా కాలేదు. దీంతో వీరిద్దరికీ 'తల్లికి వందనం' డబ్బులు రాలేదు. ఈ విషయంలో స్థానిక సచివాలయంలో అర్జీ ఇచ్చినప్పటికీ ఎందుకు డబ్బులు జమకాలేదు అని సమాధానం చెప్పేవారే కరువయ్యారు. దీంతో తమ కటుంబ పరిస్థితిని అర్థం చేసుకున్న ఈ చిట్టితల్లులిద్దరూ వారి అమ్మమ్మను వెంటబెట్టుకుని సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన పీజీఆర్ఎస్ కార్యక్రమానికి హాజరై సమస్యను కలెక్టర్‌కు విన్నవించారు. ఆదుకోవాలని కోరుతూ కలెక్టర్ లక్ష్మీశకు వినతిపత్రం అందజేశారు.

- సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపిక



మైలవరం: రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు మైలవరం మండలం వెల్వడం జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థి ఎం.వరుణ్ ఎంపికైనట్లు పాఠశాల హెచ్‌ఎం ఎం.బసవరావు సోమవారం తెలిపారు. ఇటీవల విజయవాడలో జరిగిన జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో సీనియర్ విభాగంలో షాట్ పుట్‌లో తృతీయ స్థానం సాధించాడన్నారు. ఈ నెల 9 నుంచి 11వ తేదీ వరకు చీరాలలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో వరుణ్ పాల్గొంటాడని చెప్పారు. విద్యార్థిని పాఠశాల హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, పాఠశాల విద్యా కమిటీ చైర్మన్, గ్రామ పెద్దలు అభినందించారు.

అక్రమ అరెస్ట్‌ను నిరసిస్తూ కొవ్వొత్తుల ర్యాలీ





నన్స్ అరెస్ట్‌ను నిరసిస్తూ ర్యాలీ చేస్తున్న క్రైస్తవ సంఘాల సభ్యులు

లబ్బీపేట(విజయవాడతూర్పు): ఛత్తీస్‌ఘడ్‌లో కేరళకు చెందిన ఇద్దరు నన్స్(సిస్టర్స్)ను అక్రమంగా అరెస్ట్ చేయడం తగదంటూ ఫెడరేషన్ ఆఫ్ చర్చస్ ఆధ్వర్యంలో సోమవారం కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. బిషప్ అజరయ్య స్కూల్ నుంచి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ స్మృతి వనం వరకూ కొనసాగిన ఈ ర్యాలీలో నగరంలోని అన్ని క్రైస్తవ సంఘాలకు చెందిన వందలాది మంది పాల్గొని దేశంలో ప్రజాస్వామ్యాన్ని రక్షించాలంటూ నినాదాలు చేశారు. ఈసందర్భంగా విజయవాడ కేథలిక్ డయాసిస్ మోన్సిన్యోర్, ఫెడరేషన్ ఆఫ్ చర్చస్ ఎగ్జిక్యూటివ్ సెక్రటరీ రెవరెండ్ ఫాదర్ మువ్వల ప్రసాద్ మాట్లాడుతూ నన్స్‌పై కొంత మంది మతోన్మాదులు కుట్రలు పన్ని, తప్పుడు ఆరోపణలు చేస్తూ వారిని అక్రమంగా అరెస్ట్ చేయించారన్నారు. ఈ ఘటనను దేశంలోని అన్ని సంఘాలు , సంస్థలు తీవ్రంగా ఖండిస్తున్నాయన్నారు. నన్స్‌పై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. స్వాతంత్ర్యం రాక ముందు నుంచే క్రైస్తవ మిషనరీలు సేవే పరమావధిగా విద్య, వైద్యరంగాల్లో పేదలను అక్కున చేర్చుకుని వారికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కల్పిస్తున్నాయన్నారు. అలాంటి వారిపై కక్ష సాధింపు చర్యలకు దిగడం రాజ్యాంగానికి వ్యతిరేకమని పేర్కొన్నారు. రాజ్యాంగం దేశంలో పౌరులందరికీ మతస్వేచ్ఛను కల్పించిందని గుర్తించాలన్నారు. బేతేలు మినిస్ట్రీస్ చైర్మన్ రెవరెండ్ నల్లూరి జయకుమార్‌బాబు మాట్లాడుతూ పేదలకు సేవ చేస్తున్న నన్స్‌ను అరెస్టు చేయడం ప్రజాస్వామ్యానికి విఘాతమన్నారు. ర్యాలీలో ఆర్సీఎం, సీఎస్ఐ, లూథరన్, బాప్టిస్ట్, ఐపీసీ, మెట్రోపాలిటన్ తదితర క్రైస్తవ సంస్థలకు చెందిన సిస్టర్స్, యువతీ యువకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ప్రజాస్వామ్యాన్ని రక్షించాలి..రాజ్యాంగాన్ని కాపాడాలంటూ నినాదాలు చేశారు. గుణదలమాత పుణ్యక్షేత్రం రెక్టర్ ఫాదర్ యేలేటి విలియం జయరాజు, ఇతర ఫాదర్స్ తోట సునీల్, పసల థోమస్, సిఎస్ఐ ఫాస్టర్ ఐ కరుణానిధి, ఎస్ జయకుమార్‌బాబు, గేరా హానోక్, బేతపూడి రవికాంత్ తదితరులు పాల్గొన్నారు.

మండలి కృష్ణారావు సేవలు శ్లాఘనీయం



కృష్ణారావుకు నివాళులర్పిస్తున్న గొల్లనపల్లి ప్రసాద్, నరహరిశెట్టి శ్రీహరి, ఆకుల శ్రీనివాస్

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ప్రముఖ గాంధేయవాది, మాజీమంత్రి మండలి వెంకట కృష్ణారావు సమాజానికి అందించిన సేవలు శ్లాఘనీయమని గాంధీ కింగ్ ఫౌండేషన్ మేనేజింగ్ ట్రస్టీ ప్రసాద్ గొల్లనపల్లి కొనియాడారు. మండలి వెంకట కృష్ణారావు శతజయంతి ఉత్సవాలను పురస్కరించుకుని సర్వోదయ మండలి కార్యాలయంలో ఆసంస్థ రాష్ట్ర అధ్యక్షుడు నరహరిశెట్టి శ్రీహరి అధ్యక్షతన సోమవారం వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రసాద్, సీనియర్ రాజకీయనేత ఆకుల శ్రీనివాసకుమార్ తదితరులు కృష్ణారావు చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ మండలి వెంకటకృష్ణారావు జీవితం యువతకు స్ఫూర్తిదాయకమన్నారు. దివిసీమ ఉప్పెన సమయంలో మండలి వెంకట కృష్ణారావు అందించిన సేవలు నిరుపమానమన్నారు. స్వచ్ఛంద సంస్థలు చేస్తున్న సేవలకు మించి తుఫాను బాధితులకు సేవలందించారని వివరించారు. శవసేన ఏర్పాటు చేసి వేలాది మృతదేహాలను దహనం చేయించారని గుర్తుచేశారు. గాంధీజీ మీద అభిమానంతో అవనిగడ్డలో గాంధీ క్షేత్రాన్ని ఏర్పాటు చేశారన్నారు. తొలిసారిగా ప్రపంచ తెలుగు మహాసభలను నిర్వహించి తెలుగుభాషకు అంతర్జాతీయ ఖ్యాతిని తెచ్చి పెట్టారని పేర్కొన్నారు. కార్యక్రమంలో దుర్గా కోఆపరేటివ్ బ్యాంకు మాజీ డెప్యూటీ చైర్మన్ అల్లం పూర్ణ, న్యాయవాది నరహరిశెట్టి జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

గురుకులంలో సీట్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

తిరువూరు: స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల కళాశాలలో భర్తీకాని సీట్లకు విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ రవిబాబు తెలిపారు. 5వ తరగతి, ఇంటర్మీడియెట్ ప్రథమ సంవత్సరంలో చేరడానికి గతంలో ప్రవేశ పరీక్షకు హాజరైన, హాజరు కాని వారు కూడా ఈ నెల 6వ తేదీ లోపు నేరుగా తమ కళాశాలలో దరఖాస్తులు అందజేయాలని సూచించారు. ప్రతిభ ఆధారంగా సీట్లు కేటాయిస్తామని ప్రిన్సిపాల్ తెలిపారు.